# అమ్మంటే...

దీనంగా చూస్తూ.

"నేనింతకు ముందు అమ్మగార్ని శానాసార్లే అడిగినానే... సిన్నబాబుగార్ని ఓ పాలి పంపమని. కానీ ఆ తల్లి ఒక్కపాలీ ఆ బాబుని అంపలేదు... కలిగిన మారాజులు. ఆలెందుకొస్తరే మనలాటోళ్లింటికి?" అన్నాడు రంగయ్య దిగులుగా... జీర్ణావస్థలో ఉన్న తనఇంటిని, భార్యనీ పరికించిచూస్తూ.

"లేదయ్యా... ఆ బాబు తప్పకుండొస్తాడు. నాకిలాగున్నాదని అమ్మగారితో నువ్వే సరిగా సెప్పుండవు" అంది లక్ష్మమ్మ నిష్ఠూరంగా.


"నీ పిచ్చి నీదేగానీ, నా మాటినవుగదా... పోనీలే ఎల్తానుగానీ ముందీ జావ తాగు. అలాగయితేనే నేను ఎల్తాను" అన్నాడు రంగయ్య కండిషన్ పెడుతున్నట్లుగా.

రంగయ్య 'వెల్తాను' అనడంతోనే... లక్ష్మమ్మ ముఖంలోకి కళ వచ్చింది. "సరే ఇలాగియ్యి!" అంటూ లేనిఓపిక తెచ్చుకొని లేచి కూర్చుని రంగయ్య చేతిలో గ్లాసు అందుకుంది.

* * *

"అమ్మగారూ, మాయావిడకి చాలా పెమాదంగా ఉందండమ్మా... ఒకపాలి యాసుబాబుగార్ని పంపండమ్మా. సూడాలని కలవరిస్తున్నాది. నిన్నటేల నుండీ కాలూ సెయ్యీ కూడా తిన్నగా కదపలేకపోతోంది" అన్నాడు రంగయ్య కళ్లనీళ్లపర్యంతం అవుతూ.

"అయ్యో రంగయ్యా, ఎంత పనయింది? బాబుకీమధ్య ఆఫీసులో పని ఎక్కువగా ఉంది. అందుకే రాలేకపోయాడు. ఈ రోజు తప్ప



పెబ్బిలి హైమావతి

కుండా పంపుతానులే!" అంది గౌతమి హామీ ఇస్తున్నట్లుగా.

"తప్పకుండా పంపించండమ్మా... అది బాబుగారి కోసం శానా కలవరిస్తున్నాది" అన్నాడు రంగయ్య రెండుచేతులెత్తి దండం పెడుతూ.

రంగయ్య వెళ్ళిన అరగంటకి వేదవ్యాస్ వచ్చాడు. "అమ్మా అన్నం పెట్టు, ఆఫీసుకు టైమవుతోంది" అంటూ.

"పెడతాను గానీ... ఈ రోజు ఆఫీసుకి శెలవుపెట్టాలి నాన్నా నువ్వు" అంది గౌతమి మెల్లగా.

"శెలవా, ఎందుకు?" అన్నాడు వేదవ్యాస్ ఆశ్చర్యంగా.

"ఏం లేదు నాన్నా... మొన్న చెప్పాను కదా, మనింట్లో పనిచేసే లక్ష్మమ్మకి చాలా సుస్తీగా ఉందని. ఒకసారి చూసివద్దామని" అని గౌతమి అంటూండగానే "అయితే ఏంటి? తనకి బాగుండకపోతే నేనెందుకు శెలవు పెట్టాలి... నేనేం డాక్టర్‌నా తనకి వైద్యం చేసేందుకు?" అన్నాడు వ్యాస్ చిరాగ్గా మొహం పెట్టి.

"అంతకంటే ఎక్కువేరా నువ్వు... లక్ష్మమ్మ చివరి క్షణాల్లో ఉందట. నిన్ను చూడాలని కలవరిస్తోందట. ఇందాక రంగయ్య వచ్చి చెప్పాడు. ఒక్కసారి వెళ్లి చూసివద్దాం నాన్నా మనం" అంది గౌతమి నచ్చజెపుతున్నట్లుగా.

"వాట్ నాన్‌సెన్స్... ఆఫ్టరాల్ ఒక పని మనిషికి ఒంట్లో బాగుండకపోతే చూసేందుకు మనం వెళ్ళాలా? ఎవరైనా వింటే నవ్వుతారు" అన్నాడు విసుగంతా గొంతులో ధ్వనింపజేస్తూ.

"తప్పురా, అలా అనకు... లక్ష్మమ్మ అందరి లాంటి పనిమనిషి కాదు. పైగా చావుబతుకుల్లో ఉంది. ఇన్నాళ్ళూ మనకు సేవచేసినా నోరుతెరిచి ఎప్పుడూ ఏమీ అడగలేదు. నా మాట కాదనకు" అంది గౌతమి.

"సారీ అమ్మా, నన్నిబ్బంది పెట్టకు. నాకు ఆఫీసులో చాలా పనిఉంది. కావాలంటే నువ్వు వెళ్ళివచ్చేయ్" అన్నాడు విసుగ్గా.

తల్లీ, కొడుకుల సంభాషణంతా లోపలి గదిలోనుంచి వింటున్న శంకరశాస్త్రిగారు వచ్చారక్కడికి, తాను కల్పించుకోకపోతే కొడుకు మాట వినడని గ్రహించి.

"గౌతమీ... మాట్లాడకుండా ముందు వాడికి అన్నంపెట్టు" అని కొడుకువైపు తిరిగి "భోజనంచేసి నా గదిలోకి రా... నీతో మాట్లాడాలి!" అని సమాధానం కోసం ఎదురుచూడకుండా లోపలికి వెళ్లిపోయారు శంకరశాస్త్రిగారు. అంతవరకూ అసహనంగా మాట్లాడిన వ్యాస్ చప్పున చల్లారిపోయాడు.


తండ్రంటే చాలా భయభక్తులూ, గౌరవమూ వేదవ్యాస్‌కి... అందుకే మారుమాట్లాడకుండా భోజనంచేసి తండ్రి గదిలోకివెళ్లి నుంచున్నాడు.

"భోజనం చేశావా? అలా కూర్చో!" అంటూ కుర్చీ చూపించారు శంకరశాస్త్రిగారు.

కిమ్మనకుండా కూర్చున్నాడు వ్యాస్.

"నాయనా వ్యాస్... అమ్మ చెప్పింది విన్నావు కదా... ఎందుకు వెళ్లనంటున్నావు అక్కడికి?" అనడిగారాయన గంభీరంగా చూస్తూ.

"అదేమిటి నాన్నగారూ... మీరూ అమ్మలా చాదస్తంగా మాట్లాడుతారు? ఓ పనిమనిషికి సుస్తీచేస్తే మనమంతా కట్టగట్టుకొని చూసిరావాలా? ఇదెక్కడి విడ్డూరం?" అన్నాడు కొంచెం




దూకుడుగా.

"అందరం కట్టగట్టుకొని వెళ్లనక్కరలేదు రా... ఆమె చూడాలని కోరుకుంటున్నది కేవలం నిన్నుమాత్రమే... ఎందుకంటే ఆవిడ నీ ప్రాణదాత... నీకు స్థన్యమిచ్చి బ్రతికించిన దేవత!" అన్నారు శంకరశాస్త్రిగారు.

"నాన్నగారూ!" అన్నాడు వేదవ్యాస్ ఆశ్చర్యంగా.

"అవునురా... ఆవిడ నిజంగా నీ ప్రాణదాతే... నువ్వు పుట్టినప్పుడు మీ అమ్మకు చాలా జబ్బు చేసింది... తన దగ్గర పాలు లేవు. జబ్బు మూలంగా. డబ్బాపాలు నీకు సరిపడలేదు. నీ పోషణకోసం ఆవుని కొన్నాం... దాన్ని సంరక్షించేందుకు ఈ రంగయ్యని పనిలో పెట్టుకున్నాం.

నీకు తెలుసు కదా, మనది నిప్పులుకడిగే సదాచార వంశమని... మా అమ్మగారికి మడీ, ఆచారం చాలాఎక్కువ... తులసికోట దగ్గర నుంచి ఇంట్లోకి తిరిగివస్తూ కూడా దారిలో పసుపునీళ్లు చిలకరించి దారి శుద్ధి చేసుకుంటూ వచ్చేదావిడ... ఆ మడీ ఆచారంలో అనారోగ్యంతోఉన్న మీ అమ్మ పథ్యం, పానం, నీ ఆలనా పాలనా చూడడం చాలా కష్టంగా ఉండేది.


అప్పటికే పురిటికని వెళ్లిన మీ అమ్మ నీకు ఐదునెలల వయసు వచ్చేవరకూ పుట్టింట్లో ఉండిపోయింది... ఇంకా ఎంతకాలం ఉంచుతామక్కడ? అని తీసుకువచ్చేశాము. కానీ ఇక్కడకువచ్చాక మరీ పాడయిపోయింది తన ఆరోగ్యం. దాంతో మీ అమ్మ మరీ అవస్థల పాలైంది. మరోపక్క ఆ ఆవుపాలు కూడా పడక నీకు తరుచూ విరేచనాలవుతూండేవి. అలాంటి స్థితిలో నీ ఆలనా పాలనా చూసేందుకు లక్ష్మమ్మ వస్తూండేది. ఉదయమే వచ్చి నీకు నలుగు పెట్టి, స్నానం చేయించి పక్కబట్టలు

ఉతికి ఆరబెట్టి, అమ్మకి స్నానం చేయించి వెళ్లిపోయేది... మళ్లీ సాయంత్రంవచ్చి నువ్వు ఖరాబుచేసిన బట్టలు శుభ్రంచేసి నీకు ఒళ్ళంతా నూనెరాసి మర్ధనాచేసి వేడినీళ్ళతో కడిగి పౌడ రద్ది వెళ్లేది.

ఒకసారి ఏకధాటిగా మూడురోజులు నీళ్ళ విరేచనాలతో చాలా నీరసించి పోయావు... ఏడవడానికికూడా ఓపిక లేక పక్కలెగరేస్తూ ఆయాసపడసాగావు... నీకు ఆవుపాలు కూడా పడలేదని అనుమానం వచ్చింది మాకు... డాక్టరుగారు కూడా అదేమాట అన్నారు... తిరిగి గేదెపాలు పట్టి చూడండి అని సలహా ఇచ్చారు... కానీ అవి అజీర్తి చేస్తాయోమోనని భయం వేసింది మాకు... కానీ చేయగలిగిందేమీలేక ఆ రోజు గేదెపాలు పట్టాలనుకున్నాము... లక్ష్మమ్మ వచ్చాక ఆ మాటే చెప్పాము. ఆకలిగాఉన్న నువ్వు ఆ పాలు ఆత్రంగానే తాగావుగానీ అవి ఇమడక వెంటనే కక్కేసి గుక్కపెట్టి ఏడవసాగావు.

నీ ఏడుపు విని భరించలేక నేనూ, తాతయ్యా వీధి చావిట్లోకి వెళ్లిపోయాం. మీ అమ్మ కన్నీరు కారుస్తూ నిస్సహాయంగా చూస్తూండిపోయింది. లక్ష్మమ్మ "బాబు బట్టలుమార్చి ఒళ్ళు కడిగి తీసుకువస్తానమ్మా!" అంటూ పెరట్లోకి తీసుకువెళ్లింది. నువ్వు ఆకలికి ఆగలేక ఏడుస్తున్నావని అనుభవజ్ఞురాలైన లక్ష్మమ్మ తేలిగ్గానే గ్రహించినట్లుంది. చప్పున నీ బట్టలుమార్చి ఒడిలో వేసుకొని పాలివ్వసాగింది... క్షణంలో నీ ఏడుపు మటుమాయమైంది.

మీ నాయనమ్మ తులసికోట దగ్గరనుంచి



రమ్య సాహితీ సమితి, పెనుగొండ ప్రచురించిన 'జలగీతాలు' ఆంగ్లానువాదం 'వాయిస్ ఆఫ్ వాటర్' ను డిసెంబర్ 9, 2006న బెంగుళూరులో జరిగిన వరల్డ్ పొయిట్రీ ఫెస్టివల్‌లో ఆవిష్కరించిన దృశ్యం. ఫొటోలో సమితి అధ్యక్షులు ఎం.ఆర్.వి. సత్యనారాయణమూర్తి, పెరుగు రామకృష్ణ, శైలజామిత్ర, పొయిట్స్ ఇంటర్నేషనల్ అధ్యక్షులు ఫ్రక్రుద్దీన్ అహమ్మద్, రామాచంద్రమౌళి, అంబికా అనంత్ ఉన్నారు.

ఇంట్లోకివస్తూ ఈ దృశ్యాన్ని చూసింది. "ఓసి అప్రాచ్యపు ముండా... ఎంత పనిచేశావే... మా వంశం, కులం, గోత్రం అన్నీ మట్టిపాలు చేశావు కదే!" అని పెద్ద పెట్టున గర్జించింది.

ఆ అరుపులువిని ఏం జరిగిందోనని నేనూ, మీ తాతయ్యా... మీ అమ్మా పరుగున పెరట్లోకి వెళ్లాం.

మీ నాయనమ్మ మాటలు వింటూనే లక్ష్మమ్మ నిన్ను చేతుల్లోపెట్టుకొని గజగజ వణికిపోతూ తప్పుచేసినదానిలా తలవంచుకుంది కన్నీరు కారుస్తూ.

"ఏం జరిగింది తులసీ... ఎందుకలా హైరానా పడుతున్నావు?" అనడిగారు తాతయ్య.

"చూడండి ఈ దరిద్రగొట్టుది ఎంతకు తెగించిందో... పిల్లాడికి తన పాలు పట్టింది. మన ఆచారమంతా మంటగలిపింది ఈ శూద్రపుముండ... ఇప్పుడు ఏం ప్రాయశ్చిత్తం చేసుకోవాలి మనం?" అంది మీ నాయనమ్మ ఆందోళనగా.

"అమ్మగారూ... నేను కావాలని చేయలేదమ్మా ఈ తప్పు... పిల్లోడు ఆకలికి ఆగలేక గింగిరాలు తిరిగి ఏడుస్తాఉంటే చూడలేకపోయనమ్మా... ఇదే నా పిల్లాడేడిస్తే అలా ఒదిలేస్తానా? అనుకొని పాలిచ్చానమ్మా... ఇంటికామున్న నా బిడ్డమీద పెమానంచేసి చెపుతున్నాను. అంతకంటే నాకే దురుద్దేసమూ లేదమ్మా... ఈ తప్పు కాయండమ్మా, ఇంకెప్పుడూ ఇలా చేయను" అంది లక్ష్మమ్మ కన్నీళ్లతో ప్రాధేయపడుతూ.

"చాల్లే... వెధవ ప్రమాణాలూ, నువ్వూను... నీ శూద్రపు కూడు నా పిల్లాడితో తినిపించిందికాక ఇంకా చెప్పొచ్చావు... నీదేం పోయింది. జరిగిన మహాపాపానికి ప్రాయశ్చిత్తం చేసుకోవలసింది మేమేకదా!" అంది మీ నాన్నమ్మ ఆగ్రహంగా.

అప్పుడు మీ తాతయ్యగారన్నారు "తులసీ, ఇప్పుడేమంత కొంప మునిగిందని అలా గావుకేకలు పెడుతున్నావు? పిల్లాడు ఎలా నీరసించిపోయాడో మూడురోజులుగా చూస్తూనేఉన్నాము మనమంతా. అసలు కోడలికి జబ్బు చేసిన దగ్గరనుంచీ దబ్బపండులా ఉండే మన వ్యాసుడు చీపురుపుల్లలా తయారయ్యాడు... మంచికో, చెడుకో లక్ష్మమ్మకి తోచినదేదో అది చేసింది. వాడు ఏడుపు ఆపాడు... దీనికి ప్రాయశ్చిత్తాలదాకా పోవాలా? ఇంతకీ ప్రాయశ్చిత్తం ఎవరికి జరిపిస్తావు... నోరూ వాయిలేని ఆ పసివాడికా? వాడిని కన్న తల్లిదండ్రులకా లేక పాలిచ్చిన దానికా? ఇన్ని పురాణాలు చదివావు, వ్రతాలూ, పూజలూ చేశావు... ఎందులోనైనా ఇలాంటి కులవ్యత్యాసాల గురించి వ్రాసి ఉందా? అందరినీ సృష్టించిన ఆ పరమాత్ముడికే ఏ కుల పట్టింపులూ లేవు. అందుకే నువ్వు చులకనగా చూసే శూద్రునిఇంట సైతం జన్మించాడు... అంతేకాదు, ప్రతి జీవిలోనూ పరమాత్ముడుంటాడంటూ చాటి చెప్పడం కోసమే మత్స్య, కూర్మ, వరాహావతారాలెత్తినది ఆ నారాయణుడు.

నీకీ సంగతి తెలుసా తులసీ?... ఒకసారి ఆదిశంకరాచార్యులవారు నదికి స్నానానికి పోతూండగా ఓ ఛండాలుడు ఎదురయ్యాడట... అడ్డు తొలగమన్నారట ఆదిశంకరాచార్యులవారు. అందుకా ఛండాలుడు ఎవరిని స్వామీ అడ్డు తొలగమంటున్నారు? నన్నా... నాలోని నారాయణుడినా? అని అడిగాడట. దానితో అజ్ఞానాంధకారం మాయ పొరలా కమ్మిన ఆదిశంకరాచార్యుల వారికి జ్ఞానోదయ

మైందట.

అంతటివారికి లేని ఈ కులభేదాలు నీకెం దుకు తులసీ?... ఆకలితో అలమటించే నీ మనవడికి తన క్షీరాన్నిచ్చి ప్రాణదానం చేసింది లక్ష్మమ్మ. అందుకు మెచ్చుకోవలసిందిపోయి ఇలా తూలనాడడం న్యాయమేనా? నిన్న పిల్లాడి పరిస్థితివిన్న డాక్టరుగారు ఏమన్నారో తెలుసా? మన వ్యాసుడికి పాలిచ్చే దాదినిచూస్తే మంచిది అని... కానీ ఏ తల్లి తనబిడ్డకి పాలివ్వడంమాని మన బిడ్డకిస్తుంది? అందుకే నిన్నటినుంచీ నేను తీవ్రమైన ఆలోచనలో మునిగిపోయాను... దానికీ రోజు లక్ష్మమ్మ చక్కని పరిష్కారం చూపించింది" అన్నారు మీ తాతయ్య.

"అంటే ఏమిటండీ మీ ఉద్దేశ్యం? ఆ అనాచారపుదానితో మన వ్యాసుడికి పాలిప్పిస్తానంటారా?" అంది. ఆ మాటందేగానీ అందులో ఏమాత్రం పటుత్వం లేదు.

తాతయ్య వేదాంతిలా నవ్వుతూ "ఇంతచెప్పినా ఇంకా అదే భ్రాంతిలో ఉన్నావా తులసీ... ఈ ఆచారవ్యవహారాలన్నీ మనం నీతినియమాలతో బ్రతికేందుకు మన పెద్దలు ఏర్పరచినవేగానీ మనుషుల మధ్య అడ్డుగోడలు కట్టేందుకు కాదు" అని లక్ష్మమ్మవైపు తిరిగి "ఏం లక్ష్మమ్మా... మా వ్యాసుడికి పాలు ఇవ్వగలవా?... దీనివలన నీ బిడ్డకేమీ ఇబ్బంది కలగదు కదా!" అన్నారు మీ తాతయ్య.

"ఎంత మాట బాబుగారూ, యాసుబాబుగారికి పాలియ్యడం నా బాగ్గెం అనుకుంటానండీ. మా బాబుకి ఏడాది నిండి రెండో ఏడొస్తాదండీ రేపు కార్తీక పున్నానికి... ఆడికి నెమ్మదిగా అణ్ణం అలవాటు చేత్తే సరిపోతాదండి..." అంటూ మీ నాన్నమ్మ వైపు తిరిగి రెండు చేతులూ జోడిస్తూ "అమ్మగారూ మీ ఇంటికి రావడం అంటే నాకు ఏ గుళ్ళోకో వొచ్చినట్టుంటాదమ్మా... అందుకనే రోజూ పొద్దున్నేలెగిసి సానం చేసిగాని ఇక్కడికెప్పుడూ రాలేదమ్మా నేను... ఇక ముందలకూడా రానమ్మా సానం చేయకుండా" అంది ప్రమాణం చేస్తున్నట్లుగా.

"సరే... సరే! కాస్త శుచిగా శుభ్రంగా ఉండు. వాడికసలే అనారోగ్యం" అంది మా అమ్మ రాజీకొస్తున్నట్లుగా.

ఆ సంభాషణంతా ఆద్యంతం వింటున్న మీ అమ్మ కన్నీళ్లతో మీ తాతయ్యగారివైపు చూసి రెండు చేతులూ జోడించింది కృతజ్ఞతగా. అలా చేతులు జోడిస్తూనే లక్ష్మమ్మ వైపు కూడా తిరిగింది... అది చూసిన లక్ష్మమ్మ గాభరా పడిపోతూ "అమ్మా... అమ్మా!" అంటూ చెంపలు వేసుకుంది అపరాధిలా.

మీ తాతయ్యగారు అదేం గమనించనట్లుగా "సరే లక్ష్మమ్మా... బాబుకి పాలిచ్చినందుకు నీకు నెలకు ఎంత జీతం ఇమ్మంటావో చెప్పు?" అన్నారు.

"ఎంత మాటన్నారయ్యా... బిడ్డకు పాలిచ్చినందుకు కూలి కడతారా? వద్దు బాబుగారూ... ముందట్లాగే మీ ఇంట్లో పాచిపని చేసినందుకు, చిన్నబాబుగారికీ, అమ్మగారికీ సానం చేయించినందుకూ ఇచ్చే జీతంచాలు. ఇంకేమీ వద్దండయ్యా" అంది లక్ష్మమ్మ.

ఆమె అమృత హృదయానికి మరోసారి ఆశ్చర్యపోయారు మా నాన్నగారు... జీతం రూపేణా లక్ష్మమ్మ ఏమిఇచ్చినా పుచ్చుకోదు అని గ్రహించిన మీ తాతగారు నెలకో ధాన్యంబస్తా వాళ్లింట్లో దింపించేవారు.

ఆ చల్లని తల్లి క్షీరామృతాన్ని తాగి నీవింత వాడివయ్యావు. పాపం ఆ లక్ష్మమ్మకి చేతికి

అందివచ్చిన కొడుకు రెండేళ్లక్రితం యాక్సిడెంట్‌లో పోయాడు... అప్పటినుంచీ మనోవ్యాధితో ఆమె ఆరోగ్యం క్షీణించిందని, ఎక్కడికీ కదలడంలేదని రంగయ్యద్వారా వింటూనే ఉన్నాం.

ఇప్పుడీ చివరిదశలో లక్ష్మమ్మ నిన్ను తన కొడుకుగానే ఎంచి చూడాలని కోరుకుంటోంది. వెళ్లడం నీ ధర్మం! కాదంటావా చెప్పు... ఆనాడు ఆమే ఆ చొరవ చెయ్యకపోతే ఈనాడు నువ్వు బ్రతికి బట్టకట్టి ఇలా మా ముందు ఉండేవాడివా?... కంటేనే తల్లి అవుతుందా? ఆలోచించు అన్నారు శంకరశాస్త్రిగారు.

తండ్రి చెప్పినదంతా వినడంతోనే వేదవ్యాస్ మనసంతా కుంచించుకుపోయినట్లయింది. తన అనుచిత ప్రవర్తనకు సిగ్గుపడ్డాడు. తల్లి కాని ఆ తల్లిపట్ల ఒక్కసారిగా మమతానురాగాలు వెల్లువలా పొంగుకొచ్చాయి అతనిలో.

"నన్ను క్షమించండి నాన్నగారూ... ఇప్పుడే అమ్మా నేనూ కలిసి లక్ష్మమ్మ ఇంటికి వెళ్లివస్తాము" అన్నాడు ఉద్విగ్నంగా చూస్తూ.

"మంచిది, వెళ్లి రండి!" అన్నారు శంకరశాస్త్రిగారు.

గౌతమీ, వ్యాస్ వెళ్లేసరికి ఆందోళనకరంగానే ఉంది లక్ష్మమ్మ పరిస్థితి... వాళ్లు వెళ్తూ వెళ్తూ మంచి డాక్టర్‌నికూడా వెంటబెట్టుకొని వెళ్లారు.

వాళ్లని చూడడంతోనే... రంగయ్య ఉబ్బితబ్బిబ్బవుతూ వాళ్లకి మర్యాదలు చేసేందుకు సమాయత్తం అయ్యాడు. అవేం వద్దన్నట్లుగా గౌతమి చెయ్యెత్తి కళ్లతోనే వారిస్తూ "లక్ష్మమ్మా... ఎవరొచ్చారో చూడు. బాబు... మన వ్యాస్‌బాబు వచ్చాడు" అంది కళ్లల్లో నీళ్లు చిప్పిల్లుతూండగా.

వ్యాస్ లక్ష్మమ్మ దగ్గరగావచ్చి "అమ్మా!" అన్నాడు లాలనగా ఆమె చెయ్యి పట్టుకొని.

వ్యాస్ పిలుపు ఎక్కడో పాతాళంలో ఉన్న ఆమె ప్రాణాన్ని వెలికి తీసినట్లయింది... అతని చేతి స్పర్శ మృతసంజీవనిలా తాకింది ఆమె శరీరాన్ని. అతి భారంగా కళ్లుతెరిచి వ్యాస్ వైపు చూసింది. వ్యాస్‌ని చూడడంతోనే తన కళ్లని తానే నమ్మలేనట్లుగా చుట్టూచూసింది. వ్యాస్ పక్కన గౌతమి కూడా కనబడడంతో తాను కలగనడం లేదని, నిజంగానే వారు తనని చూడడానికి వచ్చారని గ్రహించింది.

"అమ్మా, నా కోసం అంత దూరంనుంచి సెమ తీసుకొని వచ్చారా తల్లీ. చాలమ్మా.. ఈ జనమకి ఇది చాలు. ఇంక నేను చచ్చిపోయినా ఫర్వాలేదు" అంది ఆయాసపడుతూనే.

"వద్దు... అలా అనకు లక్ష్మమ్మా, నీకేం కాదు... అదుగో బాబు డాక్టరుగార్ని తీసుకువచ్చాడు. వారు పరీక్షచేసి నీకు మంచిమందు లిస్తారు. వెంటనే నయమయిపోతుంది" అంది గౌతమి ధైర్యం చెబుతున్నట్లుగా.

"అవునమ్మా, నీకేంకాదు. నేనున్నాను కదా... ఏదీ డాక్టరుగార్ని పరీక్షించనీ!" అన్నాడు వ్యాస్.

వ్యాస్ మాటలతో లక్ష్మమ్మకు పోయిన ప్రాణం లేచివచ్చినట్లయింది... తన కొడుకే మళ్లీ తిరిగి తన ముందుకొచ్చాడు అన్నంత ఆనందంతో తన్మయంగా వ్యాస్ వైపే చూస్తూ ఉండిపోయింది. డాక్టరుగారు పరీక్షించి తనకు ఇంజెక్షన్ ఇచ్చిన సంగతి కూడా గమనించలేదామె. చేత్తో ఆప్యాయంగా వ్యాస్ చేతిని నిమురుతూ ఉండిపోయింది తృప్తిగా. ●